క్లుప్తంగా

కంబాలకొండలో పర్ణశాల



కంబాకొండ పార్కులో ఆధునికీకరించిన క్యాంటీన్

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో ఆధునికీకరించిన క్యాంటీన్ పర్ణశాలను తలపిస్తోంది. ఇక్కడ కొద్ది రోజులుగా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇటీవల శిథిలావస్థలో ఉన్న క్యాంటీన్‌ను తొలగించి ఆధునికీకరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చని చెట్లను నాశనం చేయకుండా వాటి మధ్యలోనే తాటి కలప, గడ్డి ఉపయోగించి పైకప్పు నిర్మించారు. క్యాంటీన్ గోడలపై అటవీ శాఖకు చెందిన ఎర్రని రంగులు, గిరిజనుల ఆచార వ్యవహారాలతో బొమ్మలు వేశారు. దాని చుట్టూ అందం కోసం పచ్చని లేన్లు, దాని ముందు చిన్న నీటి కొలను ఏర్పాటు చేశారు. దీంతో ఈ క్యాంటీన్ సందర్శకులను కనువిందు చేస్తోంది. ఇది చూడడానికి పర్ణశాలలా ఉందంటూ సందర్శకులు అభివర్ణిస్తున్నారు. ఇక్కడ కొలను చుట్టూ సందర్శకులు సేద దీరడానికి కర్ర బెంచీలు ఏర్పాటు చేయనున్నారు.

ఆకట్టుకున్న 'విడాకులు కావాలి'



విడాకులు కావాలి నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించిన విడాకులు కావాలి నాటకం అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో భాగంగా ప్రదర్శించిన ఈ నాటకంలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకుల హృదయాలను మీటింది. ప్రస్తుత సమాజంలో నెలకొంటున్న రుగ్మతలకు అనుగుణంగా కళాకారులు నాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.

చలివేంద్రం ఏర్పాటు



ముడసర్లోవ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఆరిలోవ: ఎండల తీవ్రత పెరుగుతుండటంతో స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జీవీఎంసీ 13వ వార్డు ముడసర్లోవ జంక్షన్ దరి పాత స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద పవర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. ఇక్కడ ఉదయం, సాయంత్రం వాకర్లు, బాటసారులకు మొదటి రోజు మజ్జిగ, తాగునీరు అందించారు. కొద్ది రోజుల వరకు తాగునీరు అందుబాటులో ఉంటుందని పవర్ యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అతిథులు పాల్గొన్నారు.

140 మందికి వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం: సీపీఐ శతాబ్ది వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో అపోలో క్లినిక్ వైద్య సిబ్బంది ద్వారా 140 మంది స్థానికులకు నేత్ర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి

మహారాణిపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎల్ఐసీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలంకరణ, అనంతరం ఫుడ్ కోర్టు సమీపంలో బహిరంగ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఇతర అధికారులు, అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పని చేసే వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పోలమాంబ దర్శనం.. భక్తజన సుకృతం

పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ ఉత్సవాలకు వేళాయె..



ఉత్సవాలకు సిద్ధమైన కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం



దేవస్థానంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు



పెదవాల్తేరు రహదారిలో జాతర ఏర్పాట్లు



కరకచెట్టు పోలమాంబ దివ్య రూపం

గ్రేటర్ విశాఖలో అమ్మవార్ల జాతరంటే బురుజుపేట కనకమహాలక్ష్మి తరువాత పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ పండగే అందరికీ గుర్తుకు వస్తుంది. 14 గ్రామాల ప్రజలు జరుపుకునే శ్రీకరకచెట్టు పోలమాంబ జాతరను తూర్పు నియోజకవర్గంలోనే పెద్ద పండగగా చెప్పుకోవచ్చు. ఈ నెల 6న చాటింపుతో మొదలైన మహోత్సవాలు.. మే 6తో ముగుస్తాయి. ఏటా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. అందుకు తగ్గట్టుగా దేవదాయ శాఖ, ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది.

- బీచ్‌రోడ్డు

- 14 గ్రామాల దేవతకు భక్తుల నీరాజనాలు
- 'తూర్పు'లోనే పెద్ద పండగ
- నేడు తొలేళ్లు, రేపు ప్రధాన జాతర
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

ప్రధాన జాతర రేపు

ఈ నెల 15న కరకచెట్టు పోలమాంబ ప్రధాన జాతర అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 4.30 గంటలకు చినవాల్తేరులోని షిర్డీ సాయి ఆలయం నుంచి 18 మంది మహిళలు హారతులతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని పోలమాంబకు సారె చీర పెడతారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. మంగళవారం సాయంత్రం మద్దివారి పెద్దింటి నుంచి చదును పట్టు మీదుగా 14 గ్రామాల పెద్దల సమక్షంలో పుట్ట బంగారాన్ని అమ్మవారి దేవస్థానానికి తీసుకొస్తారు. అనంతరం ప్రధాన జాతరలో భాగంగా ఘటాల ఊరేగింపు, అనుపు ఉత్సవం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఈ నెల 22న మారువారం, 26న 5 వేల మందికి మహా అన్నదానం చేస్తారు.

చేపల వలలో ప్రత్యక్షమైన అమ్మవారు

పోలమాంబ అమ్మవారి చరిత్ర ఎన్నో ఏళ్ల నాటిది. వందల ఏళ్ల కిందట విశాఖలో సముద్ర వేటకు వెళ్లిన జాలర్లకు వారి చేపల వలలో అమ్మవారు దొరికారు. అప్పటి నుంచి సముద్ర దేవతగా అమ్మవారిని గ్రామంలో పూజించే వారు. కొన్ని రోజుల తర్వాత అమ్మవారు కలలోకి వచ్చి తనను మధ్య వంశీయలకు అప్పగించాలని జాలర్లకు సూచించారు.

కరకచెట్టు వద్ద ప్రతిష్ఠ

పోలమాంబ కోరిక మేరకు మధ్య వంశీయులకు విగ్రహాన్ని జాలర్లు అప్పగించారు. వారు పెదవాల్తేరులోని జీడి తోటలో కరకచెట్టు వద్ద విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి అమ్మవారిని కరకచెట్టు పోలమాంబగా పిలవడం ప్రారంభించారు. పెదవాల్తేరు దేవస్థానంలోని గర్భగుడిలో పోలమాంబతోపాటు నీలమాంబ, కుంచమాంబ అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. జీడి తోటలో విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వల్ల జాతర రోజున ఆలయం పైకి భక్తులు జీడి పళ్లను విసరడం ఆచారంగా వస్తోంది.



ఆలయం వద్ద సమాచారం కేంద్రం

14 గ్రామాల దేవత

కరకచెట్టు పోలమాంబను 14 గ్రామాల దేవతగా పూజిస్తారు. అమ్మవారి జాతరను పెదవాల్తేరు, చినవాల్తేరు, పెదజాలరిపేట, ఇసుకతోట, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, జోడుగుళ్లపాలెం, శివాజీపాలెం తదితర ప్రాంతాల్లోని ప్రజలు పెద్ద పండగలా జరుపుకుంటారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో పుట్ట బంగారం, తొలేళ్లు, ప్రధాన జాతర, అనుపోత్సవం, మారువారం, మహాన్నదాన కార్యక్రమాలు ముఖ్యమైనవి.

తొలేళ్ల సంబరం నేడు

ఈ నెల 6న జాతర ప్రకటనతో మొదలైన ఉత్సవాల్లో భాగంగా 7న పుట్ట బంగారం పూజ చేశారు. ఈ నెల 14న తొలేళ్ల సంబరం నిర్వహిస్తారు. సోమవారం రాత్రి 10 గంటల నుంచి అమ్మవారికి తొలి పూజ జరుగుతుంది. రాత్రంతా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మేల్కొని వీధుల్లో గుర్రాలు, రథాలు తిప్పుతారు.



ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ సదుపాయం

సకల సౌకర్యాలు.. భారీ ఏర్పాట్లు

పోలమాంబ జాతరకు లక్ష నుంచి లక్షా 50 వేల మంది భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖతోపాటు వివిధ ప్రభుత్వ విభాగాల సహకారంతో ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, విద్యుద్దీప కాంతులతో అలకరించారు. వృద్ధులు, పిల్లలు, సామాన్య భక్తుల సౌకర్యార్థం అప్పుఘర్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దేవస్థానం వరకు లెండి విద్యా సంస్థల సహకారంతో ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. అమ్మవారి దర్శనానికి క్యూ లైన్లు సిద్ధం చేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాలు నిలిపేందుకు ఏయూ మైదానంలో ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.

ప్రతిష్ఠాత్మకంగా పోలమాంబ ఉత్సవాలు



పోలమాంబ ఉత్సవాల నిర్వహణకు రూ.30 లక్షలకు పైగా వ్యయం కానుంది. రూ.40 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నాం. దేవస్థానం ఆవరణలో విచారణ కేంద్రం ఏర్పాటు చేశాం. ఏయూ మైదానంలో కార్ల పార్కింగ్‌కు అవకాశం కల్పించాం. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పిల్లలకు బిస్కట్లు అందిస్తాం. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, ఇతర శాఖల సహకారంతో గట్టి చర్యలు చేపట్టాం.

– గాయత్రి, ఈవో, కరకచెట్టు పోలమాంబ దేవస్థానం

ఆటిజంపై అవగాహన అవసరం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు, దివీస్ ఉద్యోగులు



బీచ్ రోడ్డులో వాక్‌ను ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ఏయూక్యాంపస్: నగరవాసుల్లో ఆటిజంపై అవగాహన పెంచాల్సిన అవసరముందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కే బీచ్ రోడ్డులో నిర్వహించిన ఆటిజం అవగాహన నడక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ఆటిజంపై అవగాహన కల్పించడం, ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని సమాజంలో భాగం చేయడం, సానుకూల ఆలోచనతో వారిని స్వీకరించడం ఎంతో అవసరమన్నారు. శ్రేయ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.ఉషాదేవి మాట్లాడుతూ ప్రతి ఏలా ఏప్రిల్‌లో ఆటిజం అవగాహన మాసంగా నిర్వహిస్తామన్నారు. ప్రతీ 100 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై అవగాహన కలిగి ఉండటం, సరైన సమయంలో స్పందించడం ఎంతో అవసరమన్నారు. పిల్లల్లో ఆటిజం గుర్తించడం, రోజువారి జీవితంలో వారు ఎదుర్కొనే సవాళ్లను వివరించారు. కార్యక్రమంలో దివీస్ లేబరేటరీ డైరెక్టర్ డాక్టర్ దేవేంద్రరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎల్.వి.రమణ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, అధిక సంఖ్యలో దివీస్ లేబరేటరీ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు

ఎంవీపీకాలనీ: అప్పుఘర్‌లోని ఓ నూడిల్స్ షాపు వ్యాపారి, అతడి భార్యపై దాడి చేసిన ఘటనలో ఇరువర్గాలపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. నూడిల్స్ వ్యాపారి, అతడి భార్య కొన్నేళ్లుగా అప్పుఘర్‌లో వ్యాపారం చేసుకుంటున్నారు. దానికి సమీపంలోని ఓ కార్ షెడ్ యజమాని సైతం తన షాపు ఎదురుగా ఇటీవల నూడిల్స్ షాపు ప్రారంభించా డు. తన కార్‌షెడ్ ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్‌ను వినియోగించుకుంటూ వ్యాపారం సాగిస్తున్నా డు. దీంతో కొంతకాలంగా ఇరువురి వ్యాపారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి నూడిల్స్ షాపు వ్యాపారి బాబ్జి భార్యను కార్‌షెడ్ యజమాని తిట్టడంతో మరోసారి వివాదం నెలకొంది. అనంతరం కార్‌షెడ్ యజమాని, అతడి కొడుకు బాబ్జితోపాటు అతడి భార్యపై దాడి చేశారంటూ ఎంవీపీ పోలీసులను ఆశ్రయించడంతో ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న నగర భక్తులు



మాట్లాడుతున్న టీటీడీ క్లస్టర్ సూపరింటెండెంట్ కాంతికుమార్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఆదివారం నగర భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. టీటీడీకి చెందిన వేద పండితులు భక్తులతో శాస్త్రోక్తంగా వ్రతాన్ని చేయించారు. పూజా సామగ్రిని దాతల సహకారంతో టీటీడీ అందజేసింది. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నగర ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపడంలో భాగంగా సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించినట్లు టీటీడీ క్లస్టర్ సూపరింటెండెంట్ ఎం.కాంతికుమార్ తెలిపారు. అనంతరం భక్తులకు రెండు రకాల విశిష్టమైన ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు సత్యకుమార్, సత్యనారాయణ, రమాదేవి,శ్రీనివాస్, గోపాల్, సునీత తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట



సాయినాథ్ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ సమర్థ సద్గురు సాయినాథ్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం పంచనాగ సహిత, నాగబంధ సమేత శ్రీవల్లీ దేవసేన, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలు, యంత్ర ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అర్చకుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక అభిషేకాలతో దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. గ్రామ ప్రజలందయా పాల్గొని దేవతామూర్తులను భక్తితో కొలిచారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రభాకర శర్మ, కిషోర్ శర్మ దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేసి, విఘ్నేశ్వర పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదానం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పీల కనకరాజు, ప్రధాన కార్యదర్శి కాళ్ల పోలినాయుడు, ఉపాధ్యకుడు పీల నాగేశ్వరరావు, ఆడిటర్ కాంద్రేగుల నూకేష్, ఆలయ కమిటీ సభ్యులు బొడ్డేటి నర్సింగరావు, మద్దాల నరసింగరావు, సుంకర్ నరసింహారెడ్డి, ద్రాక్షరపు నూకరాజు, బొద్దేటి సూర్యనారాయణ, మద్దాల వీరవెంకట అప్పారావు. టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆవారి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి



సంఘటనా స్థలంలో ఒడిశా వాసి మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. స్థానిక హెల్త్‌సిటీలో చికిత్స పొందుతున్న ఒడిశా రోగి బంధువు(55) ఆదివారం రాత్రి క్యూ 1 ఆస్పత్రి ఎదురుగా బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా.. ఆరిలోవ నుంచి సింహాచలం వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు అతడిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆ వ్యక్తి కిందపడంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగింది. స్థానికులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే.. అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంపై స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసుల పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

నేటి నుంచి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను అందిస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లాకు 406 యూనిట్ల సబ్సిడీ రుణాలను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. రూ.16.88 కోట్లతో 32 కేటగిరీల్లో లబ్ధిదారులకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి మే 10వ తేదీ వరకు https://apobmms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు వయసు గల వారు సబ్సిడీ రుణాలకు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డ్, తెలుపు రేషన్ కార్డ్, పాన్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని ఈడీ పేర్కొన్నారు.


అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



మెళియాపుట్టి గ్రామ కుటుంబ సభ్యుల సందడి

సీతమ్మధార: హలో బాబు.. ఎలా ఉన్నావు.. హాయ్ మురళీ, బుజ్జి, సురేష్ బాగున్నారా.. ఇప్పుడు ఏం చేస్తున్నారు.. అంటూ శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి గ్రామస్తులు కుటుంబ సమేతంగా ఆదివారం పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలోని గాయత్రీ టవర్స్‌లో ఆత్మీయంగా కలుసుకుని పలకరించుకున్నారు. చదువుకున్న రోజుల్లో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని, ఎవరు ఏ వృత్తిలో స్థిరపడ్డారో తదితర విషయాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. నగరంలో నివసిస్తున్న 200 కుటుంబాలు కలిసి సందడి చేశాయి. చిన్నారులు నృత్యం చేసి, పాటలు పాడి అలరించారు. పెద్దలు మ్యూజికల్ చైర్, జల్దీ ఫైవ్ ఆటలు ఆడి డ్యాన్స్‌లు వేశారు. జోక్స్ చెబుతూ అందరినీ నవ్వించారు. రోజంతా కబుర్లు చెప్పుకుని ఆనందంగా గడిపారు. ఆటలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఎవర్‌గ్రీన్' సమ్మేళనం



నగరంలోని హోటల్‌లో కలుసుకున్న ఎవర్‌గ్రీన్ బ్రేక్‌ఫాస్ట్ సభ్యులు

మురళీనగర్: స్నేహితులు కలుసుకునేందుకు అనేక మార్గాలను అనుసరిస్తారు. అందరూ ఓచోట కలిసి తమ అనుభవాలను పంచుకుంటారు. నగరంలోని పలువురు పదవీ విరమణ చేసిన, ప్రస్తుతం సర్వీసులో ఉన్న అధికారులు, వివిధ రంగాల్లో నిష్ణాతులు తమ స్నేహితులతో కలిసి గడిపేందుకు ఎవర్‌గ్రీన్ బ్రేక్‌ఫాస్ట్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఇది వినడానికే కొత్తగా ఉన్నప్పటికీ ప్రతి నెలా వీరు నగరంలోని ఒక హోటల్‌లో కలుసుకుని తమ స్నేహితులతో ముచ్చటిస్తూ ఆనందంగా గడుపుతారు. ప్రతి నెలా ఒక ఆదివారం వీరు బ్రేక్‌ఫాస్ట్‌కు హాజరవుతారు. ఈ మేరకు వీరు నగరంలోని ఒక హోటల్‌లో కలుసుకుని బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నారు. కుటుంబ సమేతంగా ఒక చోట చేరి ఆనందంగా గడిపారు. వీరిలో 'ది ఆర్ట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్'' సంస్థను నడుపుతూ బాలికల విద్యా వ్యాప్తికి పదేళ్లుగా కృషి చేస్తూ తన ఆదాయంలో పది శాతం కేటాయిస్తున్న డాక్టర్ సోమనాథ్ సాహాను సభ్యులు ఘనంగా సత్కరించారు. సాహాకు మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డాక్టరేట్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఆయనను అభినందించారు. ప్రైమ్ మినిస్టర్ మ్యూజియం భరత్ విభీషణ్ అవార్డు, కోల్‌కతాలో రాష్ట్రీయ శిక్షక్ అవార్డు ఆయన అందుకున్నారు. తనను సత్కరించిన సభ్యులకు సోమనాథ్ సాహా కృతజ్ఞతలు తెలిపారు.

వికసించిన బారెల్ కాక్టస్ పుష్పాలు



ప్రయాణికుల స్నేహితుడిగా పిలవబడే ఎమోరీ బారెల్ కాక్టస్(ఫెరోకాక్టస్ ఎమోరీ) మొక్క పుష్పాలు పెదవాల్తేరు బయోడైవర్సిటీ పార్క్‌లో పూర్తిగా వికసించి సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. బారెల్ కాక్టస్ మొగ్గలు సాధారణంగా ఏప్రిల్‌లో ప్రకాశవంతమైన పసుపు, నారింజ రంగు పువ్వులతో వికసిస్తాయి. ఈ జాతి మొక్కలకు ముళ్లు ఉంటాయి. ఇవి ఎడారుల్లో ఎక్కువగా కనిపిస్తాయి

- బీచ్‌రోడ్డు

రుషికొండ బీచ్‌ను సందర్శించిన వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారులు



రుషికొండ బీచ్‌లో వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ మహిళా క్రీడాకారులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌ను ఆదివారం సాయంత్రం మణిపూర్, మహారాష్ట్రలకు చెందిన 21 మంది వీల్ చైర్ బాస్కెట్‌బాల్ మహిళా క్రీడాకారులు సందర్శించారు. నిత్యం క్రీడల్లో నిమగ్నమైన వీరికి మానసిక ఉల్లాసం కోసం ఇలా బీచ్‌కు తీసుకుని వచ్చినట్లు కోచ్ కెప్టెన్ లూయిస్ తెలిపారు. వీరికి మెరైన్ పోలీసులు వెంకటరమణ తదితరులు సహాయం అందించారు.